# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రంలోని భూముల వివాదాలను పరిష్కరించే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

❖ రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

❖ పర్యావరణ హిత వినాయకులను అందరూ పూజించాలని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

❖ వాయువ్య-పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

రాష్ట్రంలోని భూముల వివాదాలను పరిష్కరించే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన 8వ కలెక్టర్ల సదస్సు రెండో రోజున రెవెన్యూ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పురపాలక, విద్యుత్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... శతాబ్ద కాలం నుంచి వివాదంలో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు. వివిధ జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ పూర్తైన భూములకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలని, ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. పీఎం సేతు కార్యక్రమాన్ని విశాఖపట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకూ విస్తరించి యువతకు మరిన్ని నైపుణ్యాలు కల్పించాలని తెలిపారు. విద్యుత్ రంగం... పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం, విద్యుత్ రంగంపై ఎల్ నినో ప్రభావం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

======================

రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ నిర్వహిస్తోన్న `ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో-2026` ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పారిశ్రామికవృద్ధిని పెంచడం, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా `ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29)` విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పాలసీ ద్వారా 2030 నాటికి `ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త` అనే వినూత్నమైన దృక్పథాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ద్వారా ఐదేళ్లలో 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందన్నారు.

======================

ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ-ఫైళ్ల పరిష్కారంలో వరుసగా మూడోసారి మొదటి స్థానంలో నిలిచి తన పని తీరును చాటుకున్నారు. అత్యంత వేగంగానే కాకుండా పారదర్శకంగా, సమర్ధవంతంగా ఫైళ్లను పరిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఫైళ్ల పరిష్కారంలో వేగంతో పాటు స్పష్టత, పారదర్శకత, సమర్ధతకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి ముందుకు సాగుతున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పరిపాలనలో జాప్యాన్ని తగ్గిస్తూ.. నిర్ణయాలను వేగంగా తీసుకోవడంలో ఈ-ఫైలింగ్ వ్యవస్థను సమర్ధవంతంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.

విరామం

======================

పర్యావరణహిత వినాయకులను అందరూ పూజించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని మహిళ కళాశాలలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఈరోజు పాల్గొన్న ఆయన.. విద్యార్థినిలకు విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... వినాయక చవితిని మట్టి విగ్రహాలు, పర్యావరణానికి హాని చేయని వస్తువులతో జరుపుకుని నిజమైన భక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో వినాయక చవితి ముందు రోజు వరకు ఈ పంపిణీ నిరాటంకంగా సాగుతుందని తెలిపారు. ఇంకోవైపు ఈ మట్టి విగ్రహాల పంపిణీ కోసం స్థానిక కుమ్మరిలతో మాట్లాడి ప్రత్యేకంగా చేయించామని.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన "వోకల్ ఫర్ లోకల్" నినాదాన్ని దృష్టిలో పెట్టుకుని.. పెద్ద ఎత్తున స్థానిక కుల వృత్తుల వారికి స్థానికంగానే మరింత ఉపాధి చేరువ చెయ్యాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

======================

వాయువ్య-పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వద్ద ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాగల 24 గంటల్లో మరింత బలపడి, ఉత్తర కోస్తాంధ్ర - దక్షిణ ఒడిశా మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

కాగా బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమైన నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర

విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తీరం వెంబడి గంటకు 50 నుండి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అల్పపీడన పరిస్థితిపై ఎప్పటి ఎప్పటికప్పుడు సందేశాలు పంపాలని అధికారులకు సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 425 0101 అందుబాటులో ఉంచామని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు.

=======================

నేతన్న భరోసా పథకం కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. బ్యాంకు స్టేట్‌మెంట్‌కు బదులుగా మాస్టర్ వీవర్ ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాలు అందిస్తే సరిపోతుందని ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. దీని వల్ల అర్హత ఉన్న నేతన్నలు దరఖాస్తు ప్రక్రియలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయని మంత్రి తెలిపారు.

=======================

వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రజలకు ఆయుష్ సేవలను మరింత చేరువ చేస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ టి. హేమాక్షి అన్నారు. జిల్లాలోని కె. వెంకటాపురం గ్రామంలో ఈరోజు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు దీర్ఘకాలిక సమస్యలు, కాలానుగుణ  రుగ్మతలను ఆమె పరీక్షించి అవసరమైన ఆయుర్వేద మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సూచనలతో ఆయుర్వేదం, హోమియో వైద్యం ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ... జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఆయుష్ సేవలు అందిస్తున్నామని తెలియజేశారు.

=======================
=======================